క్లుప్తంగా

గంజాయి అనర్థాలపై అవగాహన


చైతన్యనగర్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ చినబాబు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని చైతన్యనగర్‌లో ఎస్‌ఐ చినబాబు నేతృత్వంలో పోలీసులు గిరిజనులతో సమావేశం ఏర్పాటు చేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో జవాబుదారీతనం, ఒకరికొకరు సహకారం ఇచ్చిపుచ్చుకోడానికి ఈ సమావేశం ఉపయోగపడుతుందని ఎస్‌ఐ చినబాబు అన్నారు. గంజాయి సాగు, రవాణా వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాల వల్ల పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరమవుతుందని వివరించామన్నారు. పొలాల్లో కాపలా కోసం, వన్యప్రాణులను సంహరించేందుకు విద్యుత్‌ కంచెలు ఏర్పాటు చేస్తే ప్రాణాలకు ప్రమాదమని, ఈ విధానం చట్ట విరుద్ధమని హెచ్చరించారు. సైబర్‌ నేరాలు, ఉద్యోగం ఇప్పిస్తామంటూ ఎవరైనా వస్తే నమ్మవద్దని, వారి సమాచారం పోలీస్‌ స్టేషన్‌లో తెలియజేయాలని స్థానికులను కోరారు.

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ రేపు

కొయ్యూరు: మండల కేంద్రంలోని సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు బిడిజన అప్పారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆయన కోరారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విధిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

శ్రమదానంతో తుప్పల తొలగింపు


శ్రమదానంతో తుప్పలు తొలగిస్తున్న ఆటోడ్రైవర్లు

ఎటపాక: అధ్వానంగా ఉన్న రహదారికి ఇరువైపులా ఉన్న తుప్పలను ఆటో యూనియన్‌ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛందంగా తొలగించారు. మండలంలోని సెయింట్‌ ఆన్స్‌ పాఠశాల నుంచి గుండాల కాలనీ వెళ్లే రహదారికి ఇరువైపులా పొదలు పెరగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే రహదారి గోతులమయం ఆపై ఇరువైపులా పొదలతో వాహనదారులు నిత్యం భయాందోళన చెందుతున్నారు. ఎవరోవస్తారు ఏదో చేస్తారు అని ఎదురు చూడకుండా ఆటో యూనియన్‌ నాయకులు మర్మం శంకర్‌ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు పొదలను తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.సురేష్‌, చినబాబు, కృష్ణ, వెంకన్నబాబు, రాజు, హరి, రాము, వెంకటేష్‌ తదితరులున్నారు.

గంగాలమ్మ తల్లి గుడికి విరాళం


విరాళం అందజేస్తున్న భక్తుడు జగ్గప్పారావు

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళవరపుపేట సరిహద్దులో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడి పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు ఆలయ నిర్మాణానికి విరాళా లు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా దిబ్బ పాలెంకు చెందిన రామలక్ష్మణ ఇటుకబట్టీ యజమాని పెంటకోట జగ్గప్పారావు, సత్యవతి దంపతులు రూ.20 వేలను శనివారం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యు లు పాల్గొన్నారు.

చలో విజయవాడ పోస్టర్‌ ఆవిష్కరణ

నర్సీపట్నం: ఏపీ సీపీఎస్‌ఈఏ ఆధ్వర్యంలో సీపీఎస్‌ రద్దుకు సెప్టెంబర్‌ 1న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్‌ పిలుపునిచ్చారు. ఏపీ సీపీఎస్‌ఈఏ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పోస్టర్‌ ఆవిష్కరణలో ఆయన మాట్లాడుతూ ఓపీఎస్‌ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. చలో విజయవాడ కార్యక్రమానికి పీఆర్‌టీయూ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. పీఆర్‌టీయూ నాయకులు, తదితరులందరూ పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఏపీ సీపీఎస్‌ఈఏ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆర్‌.అప్పలరాజు, గాడి సూర్యప్రకాస్‌, డి.వి.ఆర్‌.మూర్తి, గణేష్‌, అప్పలనాయుడు, రాజు, ఈశ్వర్‌ పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి

- నిరుపయోగంగా నీటి ట్యాంకులు
- పాడైన కుళాయిలు
- నీటి కోసం అవస్థలు
- పట్టించుకోని అధికారులు


మరమ్మతుకు గురైన మంచినీరు పథకం



తాగునీటి సమస్య పరిష్కరించాలని ఖాళీ బిందెలతో మహిళల నిరసన ర్యాలీ (ఫైల్‌)

హుకుంపేట: మండల కేంద్రంతో పాటు మండలంలోని దిగుడుపుట్టు, తడిగిరి పంచాయతీ కేంద్రం, గన్నేరుపుట్టు పంచాయతీ కంగారుమామిడి, తీగలవలస పంచాయతీ డి.గరుడాపల్లి, పాతకోట పంచాయతీ చింతలవీధి, పనసపుట్టు గ్రామలతో పాటు మండలంలో పలు గ్రామాల్లో తాగునీటి సమస్యతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామల్లో తాగునీటి పథకాలు ఉన్నప్పటికీ అవి పూర్తిగా పాడై నిరుపయోగంగా మారాయి.దీంతో గ్రామస్తులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. పలు గ్రామల్లో జల్‌జీవన్‌ మిషన్‌ పథకం ద్వారా నిర్మించిన తాగునీటి పథకాలు పనులు పూర్తి కాకుండా మధ్యలోనే నిలిపివేశారు.

గతంలో మండల కేంద్రంతో పాటు 8 గ్రామల్లో సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం ద్వారా దిగుడుపుట్టు వంతెన నుంచి 8 గ్రామాలకు తాగునీటి పథకం ఏర్పాటు చేశారు. అది కొన్నాళ్లు తరువాత పాడై మూలకు చేరింది. ఏళ్లు గడుస్తున్నా మరమ్మతు చేయకపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదు. గత్యంతరం లేక గ్రామస్తులు సమీపంలోని ఊటగెడ్డలను ఆశ్రయిస్తున్నారు. గెడ్డలోని కలుషిత నీటి వినియోగంతో రోగాల బారినపడుతున్నారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు వినతులిచ్చినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి నిరసన ర్యాలీలు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


దిగుడుపుట్టులో నిరుపయోగంగా తాగునీటి ట్యాంకు


హుకుంపేటలో మరమ్మతులకు గురైన కులాయి

అధికారులు స్పందించాలి



మండలంలో గ్రామాల్లో తాగునీటి సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సుదూరంలో ఉన్న ఊటగెడ్డల నుంచి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మహిళలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. పాడైన తాగునీటి పథకాలను బాగు చేయాలి. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

– సొంటేన హైమవతి, గిరిజన మహిళ సంఘం జిల్లా కార్యదర్శి

ప్రబలుతున్న రోగాలు

మండల కేంద్రంలో తాగునీటి సమస్య వలన అనేక ఇబ్బందులు పడుతున్నాం. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కాని ఎవరూ పట్టించుకోలేదు. ఉటగెడ్డలు, పొలాల్లో దొరికే కలుషిత నీటిని వినియోగిస్తున్నాం. రోగాల బారిన పడుతున్నారు. పాడైన తాగునీటి పథకాలు, దెబ్బతిన్న పైపులైన్‌లను బాగు చేసి తాగు నీరందించాలి.

– లక్ష్మీ, చింతలవీధి, హుకుంపేట మండలం

శిథిలావస్థలో పాఠశాల భవనాలు

- బీటలు వారిన గోడలు
- వర్షం పడితే గదులన్నీ జలమయం
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- పట్టించుకోని అధికారులు

కొయ్యూరు: మండలంలోని ఎం.మాకవరం పంచాయతీ పనసలపాడు, మంప పంచాయతీ తుమ్మలబంధ, డౌనూరు పంచాయతీ ధర్మవరం పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పాడైన భవనాల్లో విద్యార్థులు చదువు సాగిస్తున్నారని, స్థానికులు సూరిబాబు, దేముడు, నాగరాజు, దారమల్లేశ్‌, రాంబాబు, విజయకుమార్‌ తదితరులు ఆవేదన చెందుతున్నారు. బీటలు వారిన గోడలు, వర్షం పడితే గదులన్నీ జలమయమవుతున్నాయని ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించేందుకు భయపడుతున్నారని చెబుతున్నారు. ఆయా గ్రామాల్లో పాడైన పాఠశాలల భవనాలకు మరమ్మతు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


పూర్తిగా శిథిలమైన పనసలపాడు పాఠశాల భవనం


బీటలు వారిన గోడలు, పెచ్చులూడిన శ్లాబ్‌

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి


మాట్లాడుతున్న నాయకుడు గిరిప్రసాద్‌

గూడెంకొత్తవీధి: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్‌ శనివారం పెదలవలస పార్టీ పంచాయతీ కమిటీని ఉప సర్పంచ్‌ లమ్మసింగి సింహాచలం ఆధ్వర్యంలో నియమించారు. పంచాయతీ అధ్యక్షుడిగా కంకిపాటి శ్రీ రాములు, ప్రధాన కార్యదర్శులుగా గడుతూరి జయరాం, చంటి, రాంబాబు, కార్యదర్శులుగా జర్త బుజ్జిబాబు, గంట మల్లేష్‌, గబులంగి బుజ్జిబాబు, మంచాల లోవరాజును ఎన్నుకున్నారు. రైతు విభాగ అధ్యక్షుడిగా కంకిపాటి బాలరాజు, ప్రధాన కార్యదర్శులుగా జర్తా బాలరాజు, సీందెరి చంటిబాబు, కార్యదర్శులుగా గెమ్మెలి వాసు, పూజారి బాలరాజు, మహిళా విభాగ అధ్యక్షురాలిగా పూజారి మంగ, ప్రధాన కార్యదర్శులుగా రాటా సునీత, లోతా కృష్ణవేణి, వీరోజి సీతమ్మ, యూత్‌ విభాగం అధ్యక్షుడిగా గడుతూరి శేఖర్‌, ప్రధాన కార్యదర్శులుగా నవీన్‌ కుమార్‌, రామారావు లోవరాజు, పడాల్‌ ఎన్నుకున్నారు. అనంతరం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంపై చర్చించారు. మండల పార్టీ అధ్యక్షుడు గిరిప్రసాద్‌ మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలన్నారు.

సెల్‌ సిగ్నల్స్‌కు అంతరాయం

స్తంభించిన బీఎస్‌ఎన్‌ఎల్‌ సేవలు

ఎటపాక: మండలంలోని బాసవాగు వద్ద నిర్మించిన బీఎస్‌ఎన్‌ఎల్‌ టవర్‌ నుంచి సేవలు నిలిచిపోయాయి. గత 15రోజులుగా సిగ్నల్స్‌ రాకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 30వ జాతీయరహదారి వెంబడి నూతనంగా బాసవాగు వద్ద సెల్‌టవర్‌ నిర్మించారు. అయితే గత నెల 31న గుర్తు తెలియని వ్యక్తులు టవర్‌ వద్ద ఉన్న పరికరాల గది నుంచి కాపర్‌వైర్‌ చోరీ చేశారు. దీంతో బీఎస్‌ఎన్‌ఎల్‌ అధికారులు ఎటపాక పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. కాగా 15రోజులు గడుస్తున్నా నేటికీ సెల్‌ సిగ్నల్స్‌ను పునరుద్ధరించేందుకు బీఎస్‌ఎన్‌ఎల్‌ శాఖ చర్యలు చేపట్టలేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా బాసవాగు, రాంగోపాలపురం, పాలమడుగు, బండలూరు, లింగాలపల్లి గ్రామాల ప్రజలు సెల్‌ సిగ్నల్స్‌ రాక అవస్థలు పడుతున్నారు. అంతే కాకుండా జాతీయ రహదారి కావడంతో ఆ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సివస్తుంది.


బాసవాగు వద్ద నిర్మించిన బీఎస్‌ఎన్‌ఎల్‌ సెల్‌టవర్‌

రవీంద్రబాబు మృతి పార్టీకి తీరని లోటు


గేదెలబందలో రవీంద్రబాబు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


అంతిమయాత్రలో పాల్గొన్న మన్యప్రగతి చారిటిబుల్‌ ట్రస్ట్‌ ఛైర్మన్‌ వికాష్‌, నాయకులు

డుంబ్రిగుడ: మండలంలోని తూటంగి పంచాయతీ గేదలబంద గ్రామానికి చెందిన శెట్టి రవీంద్రబాబు గురువారం గుండెపోటుకు గురై విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతు శుక్రవారం మృతి చెందిన విషయం తెలుసుకున్న అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శనివారం నిర్వహించే దహనసంస్కరణ కార్యక్రమనికి హాజరయ్యారు. ఆయనతో పాటు మన్య ప్రగతి చారిటిబుల్‌ ట్రస్ట్‌ ఛైర్మన్‌ చెట్టి వికాష్‌ రవీంద్రబాబు మృతదేహం వద్ద నివాళిలర్పించారు. రవీంద్రబాబుకు మాజీ పాల్గుణతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తు వారి కుటుంబాన్ని ఓదార్చారు. రవీంద్రబాబు మృతి పార్టీకి తీరని లోటన్నారు.

డుంబ్రిగుడ, పెదబయలు జెడ్పీటీసీ సభ్యులు జానకమ్మ, కూడా బొంజిబాబు, ఎంపీపీలు బాకా ఈశ్వరి, వైస్‌ ఎంపీపీ శెట్టి ఆనందరావు, మాజీ ఎంపీపీ సల్లంగి ఉమమహేశ్వరరావు, ఉమ్మడి జిల్లా ఎస్టీ సెల్‌ మాజీ అధ్యక్షుడు కమ్మిడి అశోక్‌, నియోజకవర్గ కల్చరల్‌ వింగ్‌ అధ్యక్షురాలు బంగురు శాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు ముఖి సాంబ, నాయకులు నరసింహమూర్తి, చాటరి కృష్ణ రావు, బాకా సింహాచలం, నరేష్‌, గుమ్మ నాగేశ్వర రావు, బలరాం, మొశ్య రంజిత్‌కుమార్‌, కాంగ్రెస్‌ నాయకుడు గంగాధర్‌స్వామి పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


తాజంగిలో చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు


రంపచోడవరం జీవీకె పాఠశాల వద్ద వేడుకలో స్థానికులు


చిన్నికృష్ణ, గోపిక వేషధారణలో చిన్నారులు

ముంచంగిపుట్టు: కృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా శనివారం జరుపుకున్నారు. శ్రీకృష్ణుని ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు చేశారు. శ్రీకృష్ణుని ఆలయాలను సర్వాంగసుందరంగా అలంకరించారు. భారీ ఊరేగింపు జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. చిన్నారులు రాధ, గోపిక, కృష్ణ వేషధారణలో ఆకట్టుకున్నారు. హరే రామ హరే కృష్ణ నామస్మరణతో గ్రామాలన్నీ మార్మోగాయి. గ్రామాల్లో సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. రంగునీళ్లను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ, డ్యాన్సులు చేస్తూ యువత, చిన్నారులు సందడి చేశారు. ముంచంగిపుట్టులోని సీఆర్‌పీఎఫ్‌ బేస్‌ క్యాంప్‌లో, వనుగుమ్మ పంచాయతీల్లో వేడుకలు ఘనంగా జరిగాయి.

చింతపల్లి: మండల కేంద్రంలోని పెద్దపైపువీధి, రామాలయం వీధి, తాజంగి ప్రాంతాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. తాజంగి, చింతపల్లి పెద్దపైపు వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సీలేరు : సీలేరులోని మార్కెట్‌ సెంటర్‌, రామాలయం సెంటర్‌లలో వేడుకలు ఘనంగా జరిగాయి. మార్కెట్‌ సెంటర్‌లో పేద పిల్లలకు పెన్నులు పుస్తకాలను పంపిణీ చేశారు.


సింగవరంలో కోలాటం చేస్తున్న కళాకారులు


సీలేరులో ప్రత్యేక వేషధారణలో చిన్నారులు


ఉట్టి కొడుతున్న చిన్నారి

కొయ్యూరు: సింగవరం కృష్ణుని ఆలయంలో ఘనంగా నిర్వహించారు. కృష్ణుడి శోభాయాత్రను కోలాటం, తప్పెడగుళ్ల నడుమ చేపట్టారు.సింగవరం నుంచి రాజేంద్రపాలెం వరకు శోభాయాత్ర సాగింది.

రంపచోడవరం: రంపచోడవరం జీవీకె పాఠశాల ఆవరణలో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శోభాయాత్ర నిర్వహించారు. హిందూ ధర్మ ప్రచారకులు శ్రీనివాస్‌రెడ్డి, రామారెడ్డి, అర్చకులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మోతుగూడెంలో..... మోతుగూడెం,పొల్లూరు గ్రామంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

రాజవొమ్మంగి: మండలంలోన కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. కొప్పు సూరిబాబు దంపతుల ఆధ్వర్యంలో స్థానిక కృష్ణుని ఆలయం వద్ద కార్యక్రమాలు నిర్వహించారు.

ఎటపాక: మండల కేంద్రంతో పాటు నందిగామ, తోటపల్లి, కాపవరం, కన్నాయిగూడెం గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి.

వి.ఆర్‌.పురం: మండల కేంద్రంతో పాటు రేఖపల్లి, రాజుపేట కాలనీ, వడ్డిగూడెం తదితర ప్రాంతాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.


ముంచంగిపుట్టులో చిన్ని కృష్ణులు, గోపిక వేషధారణలో చిన్నారులు


గౌరిదేవిపేటలో ఉట్టి కొడుతున్న యువకులు




పొల్లూరు, వనుగుమ్మలో ఉట్టికొడుతున్న యువత, చిన్నారులు


రాజవొమ్మంగిలోని శ్రీకృష్ణుని మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు